క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ ప్రారంభం



దామరగిద్ద: మండల కేంద్రంలోని ప్రిమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం స్థానిక నాయకులు విండో అధ్యక్షుడు ఈదప్ప, బీఆర్ఎస్ నాయకులు భీమయ్యగౌడ్ ప్రారంభించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడలో గెలుపు ఓటములు సమానంగా భావించాలన్నారు. అనంతరం టాస్‌వేసి క్రికెట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో క్రీడాకారులు మాణిక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విజ్ఞాన సదస్సు

నారాయణపేట రూరల్: స్థానిక శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన వైద్య విజ్ఞాన సదస్సు విజయవంతమైంది. మహబూబ్‌నగర్ వాసవి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శరణ్ బసవ, అపోలో శ్రీనివాస్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చారు. దీర్ఘ కాలిక వ్యాధులకు ప్రాథమిక చికిత్స, సీజనల్ వ్యాధులు, వేసవి దృష్ట్యా వచ్చే రోగాలకు సంబంధించి నివారణ విషయాలను తెలియజేశారు. అటు తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను రోగులకు చెప్పాలన్నారు. కడుపునొప్పి, మంట, జీర్ణ సంబంధ సమస్యలు, లివర్ చెడిపోవడం వంటి వాటికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో నర్సింగ్, అర్షద్, జమీర్‌పాషా, ఖాసీం, చింతలయ్య, వెంకట్రాములు, నారాయణ, శ్రీనివాస్, గోపాల్, నాగమణి, మీనాక్షి పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం



మక్తల్: జాతీయ స్థాయి ఖోఖో క్రీడా పోటీల్లో ఎంపికైనా వారిని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ తన ఛాంబర్‌లో బుధవారం వారిని ప్రశంసా పత్రాలను అందజేసి సన్మానించినట్లు రాష్ట్ర షూటింగ్‌బాల్ విశ్రాంతి పీఈటీ గోపాలం బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగాల్లో రాణిస్తే భవిష్యత్ ఉంటుందన్నారు. మక్తల్‌కు చెందిన శశిరేఖ, చాతుర్య, స్వప్న, శ్రీలత, సునీత, శివమ్మ, మహేశ్వరి, మధుప్రియ, లక్ష్మి, అయేషా, రమేష్‌కుమార్, జస్వంత్‌గౌడ్, మోహను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్, రమేష్‌కుమార్, స్వప్న, శ్రీలత, సునీత పాల్గొన్నారు.

తాగునీటి పైప్ లీకేజీ



మాగనూర్: మండలంలోని గ్రామ చెరువు సమీపంలో ఎన్‌హెచ్–167 పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి వారం రోజులుగా చెరువులోకి తాగునీరు వృథాగా పోతున్న పట్టించుకునే వారు లేరని ఆ మార్గం గుండా వెళ్లే బాటసారులు అంటున్నారు. ఈ పైపులైన్ పగిలి పోవడంతో సుమారుగా మాగనూర్, కృష్ణా మండలాల్లోని 40గ్రామాలకు పైగా తాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఒకవైపు వేసవి కాలంతో తీవ్ర తాగునీటి ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటున్న అధికారులు మాత్రం తమకు ఏమి పట్టనట్టుగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే మిషన్‌భగీరథ అధికారులు స్పందించి పగిలిన పైపులైన్ మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అండర్ బ్రిడ్జి ఇలా.. వెళ్లేదెలా?

నర్వ: మండలంలోని రాయికోడ్, కల్వాల్ రహదారిపై నిర్మించిన అండర్ బ్రిడ్జి నిర్మాణం పనులు అస్తవ్యస్తంగా చేపట్టడంతో నీళ్లు నిలుస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గత కొన్నేళ్ల క్రితం భూత్పూర్ రిజర్వాయర్ మేన్ కెనాల్ కింద చేపట్టిన బ్రిడ్జి పనులు సరిగ్గా చేపట్టకపోవడంతో నీరు ఎప్పటికీ నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం మండల కేంద్రానికి వచ్చే సీపూర్, కల్వాల్ గ్రామ ప్రజలతోపాటు ఆయా గ్రామాల వారు ఈ రహదారి గుండానే వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మరమ్మతులు చేపట్టి నీళ్లు నిల్వకుండా చేయాలని వారు కోరుతున్నారు.



రోడ్లకు మరమ్మతులెప్పుడో?

- గుంతల మయమైన బీటీ రోడ్డు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకుని అధికారులు



మాగనూర్ - వర్కూర్ వరకు వెళ్లే రోడ్డు దుస్థితి (ఫైల్)

మాగనూర్: గ్రామాల్లో మౌళిక వసతులు కల్పిస్తున్నామని పాలకులు, చెబుతున్న మాటలు ఆచరణలో కన్పించడం లేదు. ఆయా గ్రామాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం సరిగ్గా లేక ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. రోడ్డుపై అడుగడుగున ఏర్పడిన గుంతలతో నరకం అనుభవిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నాయే తప్ప పాలకుల్లో మాత్రం స్పందన కరువైంది. వీటికి తోడు ఈ దారిగుండా రైతులు పైపులైన్‌కోసం ఇష్టానుసారంగా రోడ్డును తవ్వి వదిలేశారు. మండలంలోని మాగనూర్- వర్కూర్ రోడ్డుగుంతలమయంగా మారడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- రోడ్లపై అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై కిలో మీటర్ దూరంలో పదుల సంఖ్యలోపెద్ద పెద్ద గుంతలు ఉండటంతో వాహనాదారుల రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డును పూర్తిచేసేందుకు నిధులు మంజూరు చేసినా అవి సరిపోలేదు. దీంతో రోడ్డు సగం వరకే వేసి వదిలేశారు. మిగిలిన సగం పూర్తికాకపోవడంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు మండిపడతున్నారు. గతంలో వర్షాకాలం గుంతలో నీరు నిండిపోయింది. గుంతలు పూడ్చడానికి మట్టితో నింపడంతో రోడ్లు బురదమయామై, రోడ్డులో నడుచుకుంటూ వెళ్లే వారు నరకం అనుభవిస్తున్నారు.
- ప్రస్తుతం మాగనూర్ - వర్కూర్ - నేరడగం రహదారి గుంతలతో దర్శనమిస్తుంది. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. మండలంలోని నేరడగండొడ్డి గ్రామానికి బీటీరోడ్డు మంజూరైన అది సగం వరకే వేసి వదిలేశారు. మండల కేంద్రానికి వర్కూర్ - నేరడగం, ఉజ్జెల్లి నేరడగండొడ్డి నుంచి వందలమంది ఈ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తుంటారు.
- మాగనూర్ మండల కేంద్రం నుంచి వర్కూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు 5కిలో మీటర్ల దూరం ఉంటుంది. దాదాపుగా గత ఐదేళ్లనుంచి రోడ్డుకు ఎటువంటి అభివృద్ధి చేయకపోవడంతో ఈ దారిలో ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు.
- మాగనూర్ మండల కేంద్రానికి చెందిన వర్కూర్‌లో లెవల్ బ్రిడ్జ్ శిథిలావస్థలో ఉంది. ఈ రోడ్డును పూర్తిచేసేందుకు నిధులు సరిపోకపోవడంతో కొంత దూరం వరకు మాత్రమే రోడ్డు వేసి వదిలేశారు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే ఎక్కడ ఏ గుంత ఉంటుందో తెలియని పరిస్థితి అత్యవసర సమయంలో ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే నరకమే. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి..



మాగనూర్ మండల కేంద్రం నుంచి వర్కూర్ గ్రామానికి వెళ్లాలంటే రోడ్లు పూర్తిగా గుంతలుగా ఉండటంతో ఈ రోడ్డలో ప్రయాణించాలంటే భయవుతుంది. గతంలో అనేక ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. అధికారులు స్పందించి, రోడ్డు మరమ్మతులను వెంటనే ప్రారంభించాలి.

- నర్సింహ, వర్కూర్

రోడ్డు బాగు చేయించండి..



నేరడగండొడ్డి నుంచి ప్రతిరోజూ మండల కేంద్రంలో పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై వస్తుంటాం. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తుంటాం. రాత్రి పూట ఈ రోడ్డు ప్రయాణం అంటేనే భయమవుతుంది. అధికారులు స్పందించి, రోడ్డు బాగుచేయాలి.

- బస్వరాజ్, నేరడంగండొడ్డి

త్వరలోనే చేయిస్తాం..



మండల పరిధిలోని వర్కూర్, నేరడగండొడ్డి గ్రామాల రోడ్డు పూర్తిగా ధ్వంసమైన మాట వాస్తావమే. ఈ రోడ్డుకు మరమ్మతుల నిమిత్తం ఆర్అండ్‌బీ నిధులకు ప్రతిపాదనలు పంపించాం. స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సాయంతో త్వరలోనే ఈ రోడ్డు మరమ్మతులు పూర్తిచేయిస్తాం.

-ధర్మరాజు, పంచాయితీరాజ్ ఏఈ

సమస్య పరిష్కరించాలని వినతి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న ప్లాట్స్ యాజమానులు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని బివండి కాలనీ, కొరంపేట శివారు సర్వేనంబర్ 58, 60లలో ప్లాట్ ఓనర్ల సమస్య పరిష్కరించాలని బుధవారం జిల్లా డిప్యూటీ సర్వేయర్ మూసాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్లాట్ల యాజమానులు మాట్లాడుతూ.. దాదాపు 225మంది సర్వేనంబర్ 58, 60లో 2011లో నుంచి లేఅవుట్ ప్లాట్లను కొనుక్కున్న బాధితులకు స్థానిక జిల్లా స్థాయి అధికారులు మాటిమాటికి ప్లాట్ రాళ్లను తీసివేస్తూ వారికి ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. జిల్లా అధికారుల పనితీరును వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ కోసం తీసుకున్న సర్వే నంబర్ 31 ప్రభుత్వ భూమిలోని సమగ్రంగా కొలతలు చేసి దాని చూట్టు ఉన్న మా ప్లాట్లు ఉన్న 58, 60 సర్వే నంబర్లతో పాటు 30, 32, 33, 59, 61, 62 సింగారం నుంచి మక్తల్ రోడ్డు సింగారం నుంచి నారాయణపేట రోడ్ సింగారం చౌరస్తా, సింగారం రోడ్‌లో విస్తరించి ఉన్న పట్టా ప్లాట్లను కూడా సర్వేచేసి హద్దులు మార్పుచేసిన తర్వాత మాత్రమే మా ప్లాట్ల జోలికి రావాలన్నారు. వెంటనే కలెక్టర్ సమగ్రమైన సర్వే జరిపించి హద్దులు చూపించాలని కోరారు.

ఇసుక డంపు సీజ్



మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామ సమీపంలోని నిల్వ ఉన్న ఇసుక డంపును సీజ్‌చేసినట్లు రెవెన్యూ ఆర్ఐ శ్రీశైలం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బుధవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన వార్తకు గాను వర్కూర్ వాగును సిబ్బందితో కలిసి పరిశీలించామన్నారు. అందులో భాగంగా వారు సమీపంలోని మక్తల్ మండలం దాసర్‌దొడ్డి గ్రామానికి చెందిన కొందరు ఇసుక అక్రమంగా నిల్వచేసినట్లు గుర్తించి ఇసుక డంప్‌ను సీజ్ చేశామని తెలిపారు. అనుమతుల పేరిట ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని, నిర్మాణానికి ఇసుకను ప్రభుత్వ అనుమతుల ద్వారా మాత్రమే తరలించుకోవాలని సూచించారు.

వాల్‌పోస్టర్ విడుదల

మాగనూర్: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను బుధవారం స్థానిక జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీసభ్యులు వాకిటి వాబయ్య మాట్లాడుతూ..ఈ నెల 21న స్వామివారి పల్లకిసేవతో మొదలై 25న గరుడ వాహన సేవతో ముగిస్తుందన్నారు. ఈ బ్రహోత్సవాల సందర్భంగా మండల ప్రజలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక ఇతర ప్రాంతాల వారు పెద్ద సంఖ్యలో రానున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. అలాగే స్వామివారిని పురష్కరించుకుని నిర్వహించిన టెంకాయల వేలంపాటలో గ్రామానికి చెందిన రవికూమార్‌శెట్టి రూ. ఒక లక్ష పదిహేడు వేల రూపాయలకు వేలాన్ని దక్కించుకున్నాడు. కార్యక్రమంలో మాగనూర్ గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు

నేడు మండల సర్వసభ్యసమావేశం

మరికల్: మండల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ పావని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని సూచించారు. అలాగే మండలంలోని ప్రజా ప్రతినిధులు, సమయానికి రావాలని తెలిపారు.

వేసవి క్రీడా శిబిరం పరిశీలన

నారాయణపేట రూరల్: పట్టణంలోని మినీస్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నర్సింహులు బుధవారం సాయంత్రం పరిశీలించారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి కొంతసమయం ఆటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆటలకు సమయం కేటాయించాలన్నారు. క్రీడలతో శారీరక ధృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడా కోటలో సీటు సంపాదించవచ్చన్నారు. శిక్షకులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తగిన విధంగా తర్ఫీదును ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పీఈటీ రమణ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ఆత్మకూర్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ తేజస్‌నందులాల్ పవార్ అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని ఎంవీ రామన్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులను కలెక్టరేట్‌లో కలెక్టర్ అభినందించారు. ఈసందర్భంగా విద్యార్థులు శ్లోక, వాస్తల్య, దీపిక, ధనూష్‌చంద్ర, నిహారి, హరికృష్ణ, అభిగ్న, సాయిప్రణీత్‌రెడ్డి, దీపక, పాఠశాల యాజమాన్యంతో పాటు, ఉపాధ్యాయులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రహరీపై నీలినీడలు !

- కస్తూర్బా పాఠశాల మార్పుపై వీడని సందిగ్ధం
- ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న వైనం
- నూతన భవనం పూర్తి.. ఫర్నీచర్ సైతం తరలింపు
- ప్రహరీ నిర్మాణంపై సమీప రైతుల వివాదం



పస్పుల వద్ద నూతన భవనం

మరికల్: ఎట్టకేలకు పస్పుల గ్రామ శివారులో నూతన కస్తూర్బా గాంధీ పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ భవనం చూట్టు ప్రహరీ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. భద్రత నిమిత్తం ప్రహరీ నిర్మించి విద్యార్థులకు భవనం అప్పగిస్తేనే బాగుంటుంది. కానీ ఇక్కడ భవనం పక్కన ఉన్న రైతులు తమ స్థలాన్ని అక్రమించుకున్నారని ప్రహరీ నిర్మిస్తే అడ్డుకుంటామని చెప్పడంతో అధికారులు సర్వే చేయించారు. అయినా అక్కడి రైతులు ఒప్పుకోకపోవడంతో ప్రహరీ నిర్మాణం కలగా మారుతుంది. ప్రారంభం కాకముందే పాఠశాల భవనం ఎదుట కొందరు మద్యంసేవించి సీసాలు పగలగొట్టడంతో అక్కడి పరిసరాలు మద్యం సీసాలతో అపరిశుభ్రంగా కన్పిస్తుంది. బాలికల భద్రతను దృష్టిలో ఉంచుకొని అధికారులు సమస్యాత్మకంగా ఉన్న స్థల వివాదాన్ని పరిష్కరించి ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే భవనంలోకి విషసర్పాలు వచ్చే ప్రమాదం ఉంది. అంతే కాకుండా మద్యంప్రియుల ఆగడాలు కూడా పెరిగే అవకాశం లేకపోలేదు.

ఎన్నో ఇబ్బందుల మధ్యన

2014లో మరికల్‌కు కస్తూర్బా గాంధీ పాఠశాల మంజూరైంది. మొదట్లో ఓ అద్దె భవనంలో ఐదేళ్లపాటు కస్తూర్బా పాఠశాలను కొనసాగించారు. అద్దె తక్కువగా కావడంతో ఇంటి యాజమాని ఖాళీ చేయించారు. మరికల్‌లో అద్దె భవనాలు దొరకపోవడంతో గత ఐదేళ్ల నుంచి ధన్వాడ కస్తూర్బా పాఠశాలలో మరికల్ పాఠశాలను కొనసాగిస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో ఎన్నో ఒడిదుడుకుల మధ్యన పస్పుల వద్ద ఎట్టకెలకు అధికారులు కాంట్రాక్టర్‌తో భవనం పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. వారం క్రితం నూతన భవనంలో సమాకుర్చాల్సిన ఫర్నీచర్ రావడంతో వాటిని ధన్వాడ కస్తూర్బా పాఠశాలలో భద్రపర్చారు. కానీ నూతన భవనం ప్రారంభం విషయంపై ఇంకా అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు.

ధన్వాడలోనే కొనసాగుతుంది..

పస్పుల వద్ద సిద్ధమైన నూతన భవనంలోకి కస్తూర్బా పాఠశాలను మార్చాలని ఇంకా ఏమి అనుకోలేదు. అధికారులు కాంట్రాక్టర్ నుంచి తమకు భవనం అప్పగించిన తర్వాత ప్రహరీ నిర్మాణానికి కలెక్టర్‌తో మాట్లాడేందుకు అవకాశం ఉంటుంది. అంతవరకు ధన్వాడలోనే కొనసాగుతుంది.

– పద్మ నళిని, కేజీబీవీ జిల్లా అధికారిణి

సమ సమాజ స్థాపన కోసం పోరాడుదాం



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు కృష్ణ

నారాయణపేట: సమ సమాజ స్థాపనకోసం పోరాడుదామని సీపీఐ (ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఎం.కృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్ సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యాలయంలో రెండు రోజుల పాటు రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను సీపీఐ (ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము ప్రారంభించగా, మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఎం.కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో పేద బడుగు బలహీన వర్గాల ప్రజల ఆ దినంలో ఉండాల్సిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వాళ్లకు అప్పచెబుతున్న పరిస్థితి నెలకొందన్నారు. మధ్య తరగతి ప్రజలు నిత్యవసరంగా వాడుతున్న వస్తువుల ధరలు చింతపండు, ఉప్పు, నూనె, కారం, పెట్రోల్ డీజిల్, గ్యాస్ ధరలను విచ్చలవిడిగా పెంచి కేంద్ర ప్రభుత్వం నియంత్రించడంలో విఫలమైందన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని ప్రజలు ఈ దేశంలో కోట్లలో ఉన్నారన్నారు. దేశాన్ని పరిపాలిస్తున్న పాలకవర్గాలు బడా కార్పొరేట్, పెట్టుబడుదారులకు తొత్తులుగా వారి సంపద పెంచే విధంగా వ్యవహరిస్తున్నదన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.కాశీనాథ్, యాదగిరి, కాలేశ్వర్, సలీం, కిరణ్, జయలక్ష్మి, రాము తదితరులు పాల్గొన్నారు.

షీటీంపై అవగాహన కలిగి ఉండాలి



ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న షీటీం బృందం

నారాయణపేట రూరల్: మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీం ఉంటాయనే విషయంపై అవగాహన కలిగి ఉండాలని షీ–టీం సభ్యులు బాలరాజు, నమీనా అన్నారు. బుధవారం జిల్లా ఆస్పత్రిలో రోగులు, వారి బంధువులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు, బాలికలతో ఎవరైనా ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టడానికి సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని, అమ్మాయిలకు గుడ్, బ్యాడ్‌టచ్ గురించి తెలిసి ఉండాలన్నారు. అమ్మాయిలతోపాటు మగపిల్లల్లోను మార్పురావాలన్నారు. కేసులో ఇరుక్కుంటే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని హెచ్చరించారు. బాల్యవివాహాలు చేయొద్దని, పురిట్లో చిన్నారులను చంపడం నేరమని తెలిపారు.

ఒండ్రుమట్టి తరలింపు పరిశీలన



ఒండ్రు మట్టి తరలింపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మద్దూర్: మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీలను బుధవారం ఎంపీడీఓ జయరాములు, ఏంపీఓ విజయ లక్ష్మీతో కలిసి తనిఖీలు చేశారు. వాల్యానాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన చెరువులో ఒండ్రు మట్టి తరలింపును పరిశీలించారు.నిర్ణీత కొలతల మేరకు కేటాయించిన సమయం ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300 కూలీ వస్తుందని ఉపాధి కూలీలకు సూచించారు. ఇదే క్రమంలో రెనివట్ల గ్రామంలో పల్లె ప్రకృతి వనం పరిశీలించారు. మద్దూర్‌లో భూనీడ్ రోడ్డు పక్కన ఉన్న మురుగు కాల్వలను పరిశీలించి వెంటనే మురుగు కాల్వల నిర్వహణను చేపట్టి శుభ్రం చేయించాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సిద్దేశ్వర్, ఈజీఎస్ సీసీ, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

దామరగిద్ద: జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో పీఈటీ వెంకటప్ప సమక్షంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరం కొనసాగుతుంది. స్థానిక నాయకులు దానప్ప గౌడ్ శిబిరాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.. క్రీడల్లో ప్రతిభను చాటుకుని జిల్లా, రాష్ట్ర జాతీయస్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో పీఈటీ వెంకటప్ప, స్థానిక విద్యావంతులు శంకర్, సురేష్‌రెడ్డి, గంగాధర్, నగేష్, శ్రీకాంత్ మోనేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్



ఈర్లదిన్నె పంచాయతీ పరిధిలోని సెగ్రిగేషన్ షెడ్ పరిస్థితి

అమరచింత: సెగ్రిగేషన్ షెడ్లు తడి, పొడి చెత్తలతో ఎక్కడా కనిపించడం లేదు. మండలంలోని ఈర్లదిన్నె పంచాయతీ పరిధిలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్ ఇందుకు భిన్నంగా కనిపిస్తుంది. ఇక్కడి సెగ్రిగేషన్ షెడ్‌లో అక్కడే నివసిస్తున్న జాలర్లు కోళ్ల పెంచే బుట్టలను నిల్వ ఉంచుకునేందుకు వీటిని వినియోగిస్తున్నారు. దీంతో మచ్చుకైనా ఇక్కడ తడి, పొడి చెత్త కనిపించలేని స్థితి నెలకొంది. ఇంటింటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి వాటితో సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువులను తయారుచేసి, దాన్ని అమ్మడం ద్వారా పంచాయతీకి ఆదాయం చేకూర్చుకోవాలి. ఇప్పటికై నా అధికారులు స్పందించి సెగ్రిగేషన్ షెడ్లలో తడి, పొడి చెత్తలను నిల్వ ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చిన్నగాలొచ్చినా కరెంట్ కట్..



విద్యుత్ అంతరాయంతో అమరచింతలో కమ్ముకున్న చీకటి

అమరచింత: చిన్నపాటి గాలి వీచిందంటే చాలు ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను నిలివేస్తుండటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నా విద్యుత్ అంతరాయం తప్పడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. గతంలో ఎంతటి ఈదురు గాలులతో కూడిన వర్షాలు వచ్చినా కరెంట్‌ను కట్ చేయని అధికారులు ప్రస్తుతం చీటికి మాటికి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న పరిస్థితులు దాపరించాయని విద్యుత్ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ట్రాన్స్‌కో లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్ లేక పోవడంతో సమస్యను ఎవరికి చెప్పాలో తెలియడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐడియా అదుర్స్..



ద్విచక్ర వాహనానికి నీడనిచ్చే గొడుగు

అమరచింత: వేసవి ఎండల నుంచి రక్షణ పొందేందుకు ఓ ద్విచక్ర వాహనదారుడు వినూత్నంగా ఆలోచించి అందరి దృష్టిని ఆకర్శిస్తున్నాడు. తన ద్విచక్రవాహనానికి పైభాగంలో ఒక స్టాండును ఏర్పాటు చేసి ముఖానికి వేడి తగలకుండా ఫైబర్ గ్లాసు బిగించడంతో పాటు ఎండ నుంచి కాపాడేలా గొడుగులా ఓ రేకును అమర్చాడు. దీంతో వడగాలితో పాటు ఎండ వేడి నుంచి రక్షణ లభిస్తుందని వాహనదారుడు తెలిపాడు. అమరచింత మీదుగా మరికల్ వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు స్థానిక బస్టాండ్ రహదారిపై వెళ్తుండగా సాక్షి క్లిక్‌మనిపించింది.